

పెంటకోట విజయ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర - మునగపాక : స్థానిక సంతబయల రామాలయం వద్ద శ్రీ వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆసుపత్రి విజయనగరం వారి సహకారంతో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, అనకాపల్లి వారి సౌజన్యంతో మునగపాక మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు పెంటకోట విజయ్ ఆధ్వర్యంలో మునగపాకలో ఆదివారం నిర్వహించిన మెగా ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉదయం 8 గంటల నుండి నిర్వహించిన ఈ శిబిరంలో ఆసుపత్రి వైద్యులు సుమారు 120 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు, మందులు ఇవ్వడం జరుగుతుందని పెంటకోట విజయ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ విల్లూరి నర్సింగరావు, దాడి శివ, కాండ్రేగుల భాగ్యరాజు,వేగి దేవతనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అవసరమైన యూరియా, ఎరువులు తక్షణమే సరఫరా చేయాలి

ఏపీ రైతు సంఘం డిమాండ్

విశాలాంధ్ర - చోడవరం : సెప్టెంబరు 7, ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో రైతాంగానికి అవసరమైన యూరియా ఇతర ఎరువులను తక్షణమే ప్రభుత్వం సరఫరా చేయాలని ఏపీ రైతు సంఘం డిమాండ్ చేస్తుంది. ఈ మేరకు ఏపీ రైతు సంఘం ఆదివారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. యూరియా అందక రైతాంగం తీవ్రంగా అల్లాడు తున్నారన్నారు. రాష్ట్రంలో యూరియా కొరత లేదని, 72 వేల మెట్రిక్ టన్నులు యూరియా అందుబాటులో ఉందని, మరో పదిరోజుల్లో నలభై వేల టన్నుల యూరియా దిగుమతి చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారన్నారు. కాని, అనకాపల్లి జిల్లాలో పరిస్థితి దానికి భిన్నంగా ఉందని, యూరియా సరఫరా లేక రైతులు అల్లాడిపోతుంటే, జిల్లా అధికారులు 891 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని, మరో 1500 టన్నులు అవసరం ఉంటుందని తెలిపారని, ఇంత యూరియా అందుబాటులో ఉంటే ప్రభుత్వం రైతులకు ఎందుకు సరఫరా చేయడం లేదని చోడవరం లో ఆదివారం జరిగిన సమావేశంలో రైతు సంఘం నాయకులు ప్రశ్నించారు. అదికారులు బ్లాకు మార్కెట్ ను అరికట్టడంలో పూర్తిగా విఫలం చెందారని, వెంటనే రైతు సేవా కేంద్రాలు, వ్యవసాయ కో ఆపరేటివ్ బ్యాంకులు ద్వారా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నియమించిన మల్టీ డిస్ ప్లీనరీ టీమ్‌లు బ్లాక్ మార్కెట్ షాపులు పై దాడులు నిర్వహించి, యూరియా బ్లాక్ మార్కెట్ అరికట్టాలని, రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని లేనిపక్షంలో రైతులను సమీకరించి పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న, తేలయ్య బాబు, నరసింహా మూర్తి, సాంబశివరావు, రామకృష్ణ,రాజు పాల్గొన్నారు.

యూరియా వినియోగంపై అవగాహన సదస్సులు

విశాలాంధ్ర - యస్.రాయవరం : మండలంలో తిమ్మాపురం, గుర్రాజుపేట, వమ్మవరం, పెనుగొల్లు, కొరుప్రోలు తదితర గ్రామాల్లో మండల స్థాయి అధికారులు యూరియా లభ్యత, నానో యూరియా, డిఎపి వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం ఎరువుల సరఫరా జరిగే విధంగా ప్రత్యేక చర్యలు చేసుకోవడం జరుగుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ జె.రమేష్ బాబు, ఎంపీడీవో సత్యనారాయణ, మండల వ్యవసాయ అధికారి సౌజన్య, సిఐ ఎల్.రామకృష, ఎస్సై విభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

కల్తీ ఎరువులు సరఫరా చేసిన ఆగ్రో కార్పొరేషన్ అధికారుల అరెస్టు

విశాలాంధ్ర - కె.కోటపాడు : కల్తీ ఎరువుల సరఫరా కేసులో హైదరాబాద్ కు చెందిన భూమి ఆగ్రో కార్పొరేషన్ రీజనల్ మేనేజర్ కవ్వ శ్రీనివాస్ రెడ్డి, శ్రీ వెంకటేశ్వర ఆగ్రోస్ అండ్ ఫెర్టిలైజర్స్ యజమాని ఉమారాణిని స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. ఈ మండలం, సంతపాలెం గ్రామంలో ఈ నెల 24 రాత్రి విజిలెన్స్ అధికారులు తనిఖీ నిర్వహించిన సందర్భంగా, ఏపీ 39 వై 7511 నెంబర్ గల లారీలో నిషేధిత మిశ్రమ ఎరువులు 600 బ్యాగులు (మొత్తం విలువ రూ.8,42,000/-) పట్టుకున్నారు. దీనికి సంబంధించి రసీదులు తనిఖీ చేయగా నకిలీ ఎరువులుగా గుర్తించారు. విజిలెన్స్ ఎస్ఐ రవికుమార్ వ్యవసాయ అధికారి సోమసాగర్ కేసును కేకోటపాడు పోలీసులకు అప్పగించారు. పోలీసులు లారీని ఎరువులను స్వాధీనం చేసుకొని విచారణ చేయగా హైదరాబాద్ నుంచి అక్రమంగా వచ్చినట్లుగా నిర్ధారించారు. ఈ నిషేధిత ఎరువులు రైతులను మోసం చేయడానికి ఉద్దేశపూర్వకంగా సరఫరా జరిగినందున అరెస్టు చేసినట్లు ఎస్సై ధనుంజయ తెలిపారు. ఎరువుల కొనుగోలు సమయంలో తప్పనిసరిగా లైసెన్స్ కలిగిన డీలర్ల నుండే కొనుగోలు చేయవలసినదిగా, ఎవరైనా నిషేధిత లేదా నకిలీ ఎరువులను సరఫరా చేస్తే వెంటనే కే కోటపాడు పోలీస్ స్టేషన్ లేదా వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించవలసిందిగా ఎస్సై తెలియజేశారు.

స్టీల్ ప్లాంట్ కార్మిక సంఘాలకు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి దండి ప్రియాంక పిలుపు

విశాలాంధ్ర - యలమంచిలి : పార్లమెంట్‌లో ఈనెల 9న ఉపరాష్ట్రపతి ఎన్నికలు జరుగుతున్న సందర్భంగా ఒక రోజు ముందు 8వ తారీఖున ఢిల్లీకి వినిపించేలా స్టీల్ ప్లాంట్ కార్మిక సంఘాలు భారీ నిరసన కార్యక్రమాలు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ ఇంచార్జ్ దండి ప్రియాంక పిలుపునిచ్చారు. ఆంధ్ర ఎంపీలు ఎన్‌డిఏ అభ్యర్థికి వ్యతిరేకంగా ఓటు వేయమని కార్మిక సంఘాలు పిలుపునివ్వాలని, పెద్ద ఎత్తున నిరసన తెలియజేయడం ద్వారా ఎంపీలకు కేంద్ర ప్రభుత్వానికి ఒక హెచ్చరిక పంపించునట్టు అవుతుందని ఆమె అన్నారు. ఎన్‌డిఏ అభ్యర్థి గెలిస్తే బీజేపీకి విశ్వాసం పెరిగిపోతుందని స్టీల్ ప్లాంట్ ప్రైవేటికరణ చేయడానికి రాష్ట్రంలో అన్ని పార్టీలు ఒప్పుకుంటే అవుతుందని, వచ్చే సర్వత్రిక ఎన్నికల నాటికి స్టీల్ ప్లాంట్ ప్రైవేటికరణ అయిపోతుందని ప్రియాంక అన్నారు. స్టీల్ ప్లాంట్ కార్మిక సంఘాలు ఎన్నికకు ఒక్క రోజు ముందు కథంతొక్కితే మన ఎంపీలు ఎన్‌డిఏ అభ్యర్థికి ఓటు వేయడానికి భయపడతారని ఆమె అన్నారు.

పల్లా విలియం కేరికు ఘన సన్మానం

విశాలాంధ్ర - పాయకరావుపేట : రాష్ట్ర నాటక కమిటీ డైరెక్టర్‌గా పాయకరావుపేటకు చెందిన పల్లా విలియం కేరి నియమితులయ్యారు. ఈ మేరకు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పల్లా విలియం కేరిని పలువురు నాయకులు పూలదండలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు చింతలపు ప్రదీప్, పట్టణ అధ్యక్షులు యాళ్ల వరహాలబాబు, పిఎసిఎస్ చైర్మన్ దేవవరపు రాజుబాబు, గొర్రెల రాజబాబు, మజ్జూరి నారాయణరావు, దేవవరపు రఘు, ఆచంట దొర, గొల్లపల్లి నాగు, మలిపెద్ది సతీష్, అక్కిరెడ్డి వరహలు, బోడపాటి శ్రీను, ఎమ్మిలి దుర్గా ప్రసాద్, సలికే రమణ, శివలంక నాగమల్లి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ రైల్వే స్టేషన్ మరో అరుదైన ఘనత : ఎంపీ సీఎం.రమేష్

విశాలాంధ్ర - యలమంచిలి : పర్యావరణ పరిరక్షణలో విశాఖ రైల్వే స్టేషన్ మరో అరుదైన విజయాన్ని సాధించింది. గ్లోబల్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ ప్రకటించిన 'గ్రీన్ రైల్వే స్టేషన్' ప్లాటినం సర్టిఫికేట్ను అందుకోవడం విశాఖ రైల్వే స్టేషన్‌కు ఒక గొప్ప గౌరవం అని రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సీఎం రమేష్ తెలిపారు. రైల్వే పరిధిలో పర్యావరణ హిత చర్యలు, శుభ్రత, ఆధునిక పారిశుధ్య విధానాలు, నీటి సంరక్షణ, విద్యుత్ ఆదా, హానికరమైన ఆయిల్ వినియోగం తగ్గించడం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించి ఈ ప్రతిష్టాత్మక గుర్తింపుని అందజేస్తారని ఈ సందర్భంగా తెలియజేశారు. దేశవ్యాప్తంగా రైల్వే స్టేషన్లకు ఇది ఆదర్శంగా నిలిచే ఘనత. పర్యావరణ పరిరక్షణలో అంకితభావంతో కృషి చేసిన రైల్వే అధికారులు, సిబ్బందికి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. ముఖ్యంగా ఎన్విరాన్మెంట్, హౌస్‌కీపింగ్ విభాగాల పనితీరు అద్భుతం అని కొనియాడారు. ఈ విజయం వారందరి సమిష్టి కృషికి నిదర్శనం అని పేర్కొన్నారు. రైల్వే మంత్రిత్వశాఖ దిశానిర్దేశం, కొత్త సాంకేతికతల వినియోగం, ప్రయాణికులకు అందిస్తున్న ఆధునిక సౌకర్యాల వల్ల విశాఖ రైల్వే స్టేషన్ ఈ అరుదైన ఘనతను అందుకుంది అన్నారు. విశాఖ రైల్వే స్టేషన్ పర్యావరణ పరిరక్షణలో, ప్రజా సేవలో మరింత ముందుకు సాగి రైల్వే అభివృద్ధికి దోహదం చేయాలి అని భవిష్యత్తులో కూడా విశాఖ రైల్వే స్టేషన్ మరిన్ని ప్రతిష్టాత్మక విజయాలను సాధించాలని ఆకాంక్షించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేసిన మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి

విశాలాంధ్ర - సబ్బవరం : మండలంలోని బంగారమ్మపాలెం పంచాయతీకి చెందిన అనారోగ్య బాధ్యతలైన ఇద్దరకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మాజీ ఎమ్మెల్యే, ఏపీ కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్, పెందుర్తి నియోజకవర్గం ఇంచార్జ్ గండి బాబ్జి ఆదివారం అందజేశారు. బంగారమ్మ పాలెం పంచాయతీ కి చెందిన యండపల్లి గౌరీ శంకర్ 50,250 రూపాయలు, దూరి సరోజని, శేఖర్ శివాలయం పంతులు 70,162 రూపాయలు చెక్ లను ఆయన చేతుల మీదుగా అందచేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాడి లావణ్య కన్నంనాయుడు , భరణికాన బాబురావు, కార్పొరేట్ బల్ల శ్రీనివాసరావు , దొడ్డి రాము, గవర అప్పారావు,యండపల్లి, నానాజీ, ఉమా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా : తహశీల్దార్ చిన్నకృష్ణ

విశాలాంధ్ర - సబ్బవరం : ఖరీఫ్ సీజన్ లో రైతులు తమకు అవసరమైన యూరియా కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మండల తాసిల్దార్ బి.చిన్నికృష్ణ అన్నారు. మండలంలోని గొట్టివాడ పంచాయితీ లో ఆదివారం ఏర్పాటు చేసిన గ్రామసభలో అయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో యూరియా రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అయితే రైతులు పంటకాలం మొత్తానికి సరిపడే యూరియా ను ఒకేసారి తీసుకొని వెళ్లడానికి ప్రయత్నం చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేసారు. అధిక మొత్తంలో యూరియాను వరి పంటలకు వేయడం సరికాదని పేర్కొన్నారు. వరికి పిలక దశలో, చిరుపొట్ట దశలో కావాల్సిన యూరియా కోసం వ్యవసాయ అధికారి ఇప్పటికే ఇంటెండెంట్లు పంపినట్లు తెలిపారు. ఈ విషయాన్ని స్థానిక ఎంపీడీవో పి. పద్మజ, స్థానిక వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ గ్రామాల్ని సందర్శించి రైతులకి తెలియజేసినట్లు అయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వీరయ్య, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా

విశాలాంధ్ర - కోటవురట్ల : ఖరీఫ్ సీజన్‌లో వరి పంట వేసే రైతులకు యూరియా అందుబాటులో ఉంటుందని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారిని సరోజినీ అన్నారు. ఆదివారం కైలాస పట్నం రైతు సేవా కేంద్రంలో యూరియా వాడకం పట్ల రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ రైతులంతా యూరియా వాడకాన్ని తగ్గించి వర్మీ కంపోస్టు ద్వారా వచ్చే సహజ సిద్ధమైన ఎరువులను వాడాలని సూచించారు. యూరియాను అవసరం మేరకే వరి పంటలో వెయ్యాలన్నారు. మండలంలో ఉన్న అన్ని రైతు సేవా కేంద్రాల్లో యూరియా పిండి అందుబాటులో ఉందన్నారు. రైతులు పండించే పంటలకు ఈ పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. తద్వారా పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించడానికి అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తాసల్దార్ తిరుమలబాబు, మహిళా పోలీస్ లలిత, భీముని మాణిక్యాలరావు, కోలా రమేష్, అప్పికొండ రమేష్, నునగుప్పుల కృష్ణ, మద్దాల భాగ్యరాజు, వంకల లోవరాజు, అనపర్తి చంటి, రైతులు పాల్గొన్నారు.

యూరియా కొరతపై నిరసన కార్యక్రమానికి వైసీపీ పిలుపు

విశాలాంధ్ర - గొలుగొండ : రేపు తొమ్మిదో తారీకు మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆర్డిఓ కార్యాలయాల వద్ద అన్నదాత పోరు పేరుతో శాంతియుత ఆందోళన కార్యక్రమం నిర్వ హించాలని వైయస్సార్సీపి పార్టీ పిలుపునిచ్చింది. పార్టీ ఆదేశాల మేరకు నర్సీపట్నం మాజీ శాసన సభ్యులు పెట్ల ఉమాశంకర్ గణేష్ రైతులు ఎదు ర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వానికి రైతుల ఆవేదన ఆందోళనను తెలియజేయాలని పార్టీ మండల ఇన్చార్జిలకు ఆదేశాలు ఇచ్చారు ఆ మేరకు గొలుగొండ మండల వైఎస్సార్సీపీ పార్టీ అధ్యక్షులు పాణి శాంతారాం ఉపాధ్యక్షులు చింతల బుల్లి ప్రసాద్ వైస్ ఎంపీపీ సుర్ల బాబ్జి నాగపురం సర్పంచ్ ఎలమంచిలి రఘురాం ఆధ్వర్యంలో ఆదివారం కృష్ణ దేవి పేట ఏ ఎల్ పురం గ్రామాలలో వైయస్సార్సీపి నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పరచుకొని ప్రస్తుత అధికార కూటమి ప్రభుత్వం రైతుల సమస్యలను ముఖ్యంగా యూరియా కొరతను పట్టించు కోవడం లేదని రైతులు యూరియా కోసం గంటల తరబడి వరుసలో నిలబడాల్సిన పరిస్థితి. గత ప్రభుత్వం రైతుల కోసం అనేక సంక్షేమాలు అమలు చేసిందని కానీ ప్రస్తుత ప్రభుత్వం రైతులను పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తుంది అని విమర్శించారు ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ సుర్ల బాబ్జి మాట్లాడుతూ రైతుల సమస్యలు పరిష్కరించే వరకు మా వైఎస్ఆర్సిపి పార్టీ పోరాటం చేస్తుందని నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయా లన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షు రాలు లోచల సుజాత గ్రామ పార్టీ అధ్యక్షులు చిటికెల వివేక నంద నాయుడు ఎంపీటీసీ మామిడి కృష్ణ మరియు కృష్ణ దేవి పేట సర్పంచ్ పందిరి సత్యనారాయణ పార్టీ సీనియర్ నాయకులు గిరిబాబు పాల్గొన్నారు.

వినాయక లడ్డు వేలం పాట

విశాలాంధ్ర - కోటగురుట్ల : మండలంలో రామచంద్రపాలెం గ్రామంలో ఉన్న వినాయక మండపం వద్ద స్వామివారికి భక్తులు తయారుచేసిన లడ్డుకి వేలంపాటి నిర్వహించారు. శ్రీకృష్ణ యూత్ అధ్యక్షు డైన నంబారు రాంబాబు, ఎస్. రమణల ఆధ్వ ర్యంలో శ్రీకృష్ణ యూత్ సభ్యుల సమక్షంలో వినాయక లడ్డుకి వేలం పాట నిర్వహించగా శ్రీకృష్ణ యూత్ సభ్యులైన అయితే బుజ్జి రూ,,79200 వినాయక లడ్డును దక్కించుకున్నారు. కమిటీ సభ్యులు, మహి ళలు, గ్రామస్తుల సమక్షంలో వినాయక స్వామి వారి లడ్డూను పాటదారుడైన అయితే బుజ్జికి అందజేశారు.

మహిళలకు ఉచిత బస్సు రద్దు చేయాలంటూ ఆటో డ్రైవర్లు ర్యాలీ

విశాలాంధ్ర - పాయకరావుపేట : రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అమలు చేసిన ఉచిత బస్సు పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పాయకరావుపేటలో శ్రీ దుర్గ ఉషోదయ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ల యూనియన్ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటోలకు డిమాండ్ తగ్గి, ఆటోల మీద ఆధారపడి జీవనం సాగిస్తున్న తమకు ఉపాధి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి లేక తమ కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాయిని తెలిపారు. కూటమి పార్టీలను నమ్ముకొని ఓట్లు వేస్తే ఆటో డ్రైవర్లకు అన్యాయం చేయడం తగదన్నారు. ఆటోలు అప్పులు చేసి తెచ్చుకున్నామని, ఉచిత బస్సు కారణంగా కిరాయిలు లేక అప్పులు చెల్లించలేకపోతున్నామని తెలిపారు. ఆటో డ్రైవర్లకు పెన్షన్ ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు లావేటి ఈశ్వరరావు, వల్లు అప్పారావు, గొల్లపల్లి బుజ్జి, పప్పు నాగేశ్వరరావు, కిల్లాడ రమణ, నల్లమట్టి అర్జున్, దొమ్మేటి వెంకట్, గొల్లపల్లి బుజ్జి, సఖిరెడ్డి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట పీఏసీఎస్‌లో అందుబాటులో 12 టన్నుల యూరియా

విశాలాంధ్ర - పాయకరావుపేట : పాయకరావుపేట పిఎసిఎస్ లో 12 టన్నుల యూరియా అందుబాటులో ఉన్నట్లు, అవసరమైన రైతులు సద్వి నియోగం చేసుకోవాలని పిఎసిఎస్ చైర్మన్ దేవవరపు రాజు బాబు కోరారు. పిఎసిఎస్ ద్వారా రైతులకు రాయితీపై యూరియా పంపిణీ కార్యక్రమాన్ని ప్రారం భించారు. ఈ సందర్భంగా చైర్మన్ దేవవరపు రాజుబాబు మాట్లాడుతూ పిఎసిఎస్ పరిధిలోని రైతులకు మొదటి దశలో 12 టన్నుల యూరియా అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. రైతులు వారి ఆధార్ కార్డు, పాస్ పుస్తకం జిరాక్స్ కాపీలు అందజేసి యూరియా తీసుకోవచ్చని తెలిపారు. ఒక ఎకరా రైతుకు ఒక యూరియా బస్తా, ఎకరా మించి భూమి ఉన్న రైతుకు రెండు యూరియా బస్తాలు చొప్పున పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు చింతలపు ప్రదీప్, పట్టణ అధ్యక్షులు యాళ్ళ వరహాల బాబు, తోట నగేష్, పెదిరెడ్డి చిట్టిబాబు, పెదిరెడ్డి శ్రీను, కంకిపాటి వెంకటేశ్వరరావు, బొంది కాశీ విశ్వనాథ్, గొర్రెల రాజబాబు, మజ్జూరి నారాయణరావు, దేవవరపు రఘు, దేవవరపు ఆనంద్ కుమార్, నారపురెడ్డి పద్మావతి, నారపురెడ్డి మునిలి, కట్ట శ్రీను, చింతకాయల రాంబాబు, పల్లా విలియం కేరి, జూరెడ్డి ప్రసాద్, గొల్లపల్లి నాగు, వేములపూడి అప్పారావు, ముంజులూరి దుర్గాప్రసాద్, కార్యదర్శి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఇంచార్జ్‌గా చింతకాయల రాంబాబు

విశాలాంధ్ర - పాయకరావుపేట : ఆంధ్ర కొప్పుల వెలమ సంక్షేమ సంఘం పాయకరావుపేట నియోజకవర్గ ఇంచార్జ్‌గా పాయకరావుపేటకు చెందిన చింతకాయల రాంబాబు నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు రావు సంభంగి నుండి చింతకాయల రాంబాబు నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా చింతకాయల రాంబాబు మాట్లాడుతూ అందరిని సమన్వయ పరుస్తూ కొప్పుల వెలమ సంక్షేమ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. తనకు పదవి కల్పించిన సంఘం రాష్ట్ర అధ్యక్షులు రావు సంభంగికి కృతజ్ఞతలు తెలిపారు. రాంబాబు నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

విశాలాంధ్ర - మునగపాక : మేజర్ పంచాయతీ మునగపాక బైపాస్ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు తమవంతు విరాళాలు అందజేస్తున్నారు. రూ.5 కోట్లతో ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి.శ్రీ సిటీ లేఔట్ ఎమ్.బి.వి.కె నాయుడు,బాబ్జి నాయుడు కలిసి ఆదివారం 1 లక్ష విరాళంగా ఆలయ కమిటీకి అందజేశారు.ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్,కాళ్ళ జగ్గారావు,ఆడారి కృష్ణ,ఆడారి గోపి, దిమ్మల శివ తదితరులు పాల్గొన్నారు.

యూరియాపై ప్రతిపక్ష నేతలు దుష్ప్రచారం : ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

విశాలాంధ్ర - సబ్బవరం : జిల్లాలో ఎలాంటి యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందవద్దని,ప్రతిపక్షాలు యూరియా కొరత ఉందని విషపూరిత ప్రసారం చేసి కూటమి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నాయని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు తీవ్రంగా ఖండించారు. మండలంలోని పైడివాడ అగ్రహారం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన భారత పెట్రోలియం బంక్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉన్నప్పటికీ,ప్రతిపక్షాలు విషపూరిత ప్రకటనలు చేసి యూరియా కొరత ఉందని ప్రచారం చేయడం వాస్తవం కాదని తీవ్రంగా ఖండించారు. తమ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని రైతులకు ఖరీఫ్ సీజన్ కు సంబంధించి వరి పంటకు కావలసిన యూరియాను ప్రభుత్వం అందుబాటులో ఉంచిందన్నారు. రైతులు ప్రతిపక్షాలు చేసిన ప్రసారాన్ని ఎట్టి పరిస్థితుల్లో నమ్మవద్దని రైతులకు కావలసిన యూరియా అన్ని రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచుతామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సీరం అప్పలరాజు, మాజీ ఎంపీటీసీ అక్కిరెడ్డి రామలక్ష్మి దుర్గి నాయుడు, మాజీ సర్పంచ్ బొబ్బరి కన్నారావు పలువురు కూటమినేతలు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పార్లమెంటరీ కార్యదర్శిగా ఏడువాక

విశాలాంధ్ర - చోడవరం : చోడవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏడువాక సత్యారావును పార్లమెంటరీ పార్టీ కార్యదర్శులుగా నియమిస్తూ వైసిపి కార్యాలయం ఆదేశాలు జారీ చేసినట్లు ఆదివారం మీడియాకు తెలియజేశారు. ఏడువాక సత్యారావుకు పాడేరు, అరకు నియోజకవర్గాల పార్టీ పార్లమెంటరీ పరిశీలకులుగా నియమించినట్లు తెలిపారు. ఈ మేరకు వైసిపి అభిమానులు కార్యకర్తలు ఏడువాకకు శుభాకాంక్షలు తెలిపారు.

రైతులందరికి ఎరువులను అందజేస్తాం

విశాలాంధ్ర - వి.మాడుగుల : రైతులందరికి ఎరువులను అందజేస్తామని మాడుగుల తహశీల్దార్ కే.రమాదేవి అన్నారు. ఆదివారం మాడుగుల సచివాలయంలో సమా వేశం ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రైతులకు యూరియా అందిం చేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కాస్త ఆలస్యమైన తప్పనిసరిగా రైతులకు యూరియా అందిస్తామని చెప్పారు. రైతులు ఎటువంటి ఆందోళన పడవద్దన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కొట్నాల త్రినాథ్, టిడిపి మండల కార్యదర్శి పుప్పాల రమేష్, సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉప సర్పంచ్ జవ్వాది వరహాలు, జనసేన సంయుక్త కార్యదర్శి రొబ్బా మహేష్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి : పాత్రపల్లి వీరుయాదవ్

విశాలాంధ్ర - అనకాపల్లి : స్థానిక ఉడ్ పేటలో గల విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు పాత్రపల్లి వీరు యాదవ్ ఆధ్వర్యంలో జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ సహకారంతో దివ్యాంగులైన మాటూరు ఏసుదాసు, బానోద్ దిలీప్ కు ట్రై సైకిల్, వీల్ చైర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీరు యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంలో మహిళల కోసం స్త్రీ శక్తి పథకం కింద రాష్ట్రంలో ఎక్కడ నుంచి ఎక్కడికైనా మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణం చేసే సౌకర్యం కల్పించారని. కోట్లలో ఉన్న మహిళల కోసం రాష్ట్ర ప్రభుత్వం సంవత్సరానికి కొన్ని వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తుందని. అలాంటిది కేవలం వందలల్లో ఉండే నిస్సహాయులైన దివ్యాంగులకు రాష్ట్రంలో ఉచితంగా ప్రయాణం చేసేందుకు ఎటువంటి బస్సు పాసులు లేకుండా కేవలం సదరం సర్టిఫికెట్ ఆధారంగా ఉచితంగా బస్సుల్లో ప్రయాణించే హక్కును కల్పించకపోవడం నిజంగా బాధాకరమని అన్నారు. ఎంతోమంది దివ్యాంగులైన విద్యార్థులు తమ చదువుల కోసం, ఉన్నత చదువుల కోసం ఎన్నో ఇబ్బందులను పడుతూ రోజు సుదూరం ప్రయాణం చేస్తూ ఉంటారని. అలాంటివారికి బస్సు పాసులపై పరిమితులు పెట్టి అన్నిచోట్ల తిరిగే సౌలభ్యం కల్పించకపోవడం శోచనీయమని అన్నారు. అంతేకాకుండా తమ తమ కుటుంబాలను పోషించుకోవడం కోసం కృత్రిమ అవయవాలను అమర్చుకొని శారీరకంగా బాధలను అనుభవిస్తూ బస్సుల్లో ప్రయాణం చేస్తుంటారని. వారి పట్ల మానవత్వం లేకుండా ఎక్కడపడితే అక్కడ దించేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని. నిజానికి అన్ని అవయవాలు బాగున్నవారికి ఉచితం పెట్టినప్పుడు. దివ్యాంగుల కోసం కూడా ఆలోచన చేసి ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని డిమాండ్ చేశారు. నిస్సహాయులైన దివ్యాంగులకు కూడా ఈ ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తే, రాష్ట్రంలో దివ్యాంగులకు ఎంతో మేలు జరుగుతుందని. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పునరాలోచన చేసి రాష్ట్రంలో ఉన్న దివ్యాంగులకు బస్సు పాసులతో సంబంధం లేకుండా కేవలం సదరం సర్టిఫికెట్ ఆధారంగా రాష్ట్రంలో ఉన్న దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్థు వాటర్ సర్వీసింగ్ సెంటర్ నామ చంద్రశేఖర్, చెట్టుపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యూరియా, ఫెర్టిలైజర్ అక్రమ నిల్వలు రవాణపై మండల, గ్రామ స్థాయి కమిటీలు ఏర్పాటు

విశాలాంధ్ర - చోడవరం : ఖరీఫ్ సీజన్‌లో రైతాంగానికి అవసరమైన యూరియా, ఇతర ఎరువులు అందుబాటులో ఉంచేందుకు, అక్రమ నిల్వలు, రవాణా అరికట్టేందుకు మండల స్థాయి, గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేసినట్లు మండల తహసిల్దార్ ఏ.రామారావు ఆదివారం మీడియా కు తెలియజేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణాలను తనిఖీలు జరిపి, మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి రైతాంగానికి అవసరమైన విధంగా ఎరువులు, యూరియా సరఫరా జరగాలని గ్రామ ప్రజలకు అవగాహన కల్పించామని తెలియజేశారు. మండల స్థాయిలో తహసిల్దార్, మండల వ్యవసాయ అధికారి, పోలీస్ స్టేషన్ హౌస్ అధికారి లతో కమిటీ వేసామని, అన్ని గ్రామాల్లో అవగాహన కల్పించి, గ్రామసభలు నిర్వహించినట్లు తెలిపారు. మండలంలో ఆదివారం టీము సభ్యులతో కలసి అన్ని గ్రామాల్లో అవగాహన కల్పించమని, దీని పై మండల కేంద్రంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసామని తెలియజేశారు. రైతాంగానికి యూరియా పంపిణీ సంబంధిత ఫిర్యాదులు, సందేహములు ఉన్నచో ఈ దిగువ కంట్రోల్ రూమ్స్ కి కాల్ చేయ వచ్చునని తహసీల్దారు, ఎం.పి.డి.ఓ లు తెలియజేశారు. మండలాల్లో యూరియా అక్రమ నిల్వలు రవాణా కంట్రోల్ రూమ్ అధికారులు కార్యాలయాల ఫోన్ నెంబర్లు :

1. మండల తాసిల్దార్ కార్యాలయం, చోడవరం. ఫోన్ నెంబర్. 08934- 294188,
2. మండల వ్యవసాయ అధికారి - 83310 56404
3. పోలీస్ స్టేషన్ హౌస్ అధికారి - 81429 36937